మీ వాటా ఇస్తేనే అదనపు రుణం!

- జెన్‌కోకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మెలిక
- నిధులకోసం 2 నెలలుగా ఎదురుచూపులు
- యాదాద్రి విద్యుత్తు కేంద్రం నిర్మాణం మరింత ఆలస్యం
- నిమిత్తమాత్రంగా ప్రభుత్వం.. సమీక్షలతోనే సరి

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణం మరింత ఆలస్యం అయ్యేలా కనిపిస్తున్నది. థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి విడుదల కావాల్సిన అదనపు రుణం విడుదల కాకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తున్నది. పైగా జెన్‌కో విడుదల చేయాల్సిన వాటా మొత్తాన్ని విడుదల చేస్తేనే అదనపు రుణం నిధులను విడుదల చేస్తామంటూ రుణానికి హామీ ఇచ్చిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) స్పష్టంగా చెప్పడంతో జెన్‌కో ఎటూ పాలుపోలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. 4000 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణం మొన్నటి వరకు శరవేగంగా సాగింది. కొద్దిరోజుల నుంచి థర్మల్ ప్లాంటు నిర్మాణ పనుల్లో వేగం పూర్తిగా మందగించింది. దీనికి జెన్‌కో తన వాటాగా చెల్లించాల్సిన మొత్తం చెల్లించకపోవడమే తక్షణ కారణమని తెలుస్తున్నది. డిసెంబర్ నుంచే ఇలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో.. ప్రభుత్వం నుంచి రావాల్సిన హామీలు, ఆర్థిక సహాయం అందడం లేదని సమాచారం.

7500 కోట్ల రుణం నిలిపివేత

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో తెలంగాణ జెన్‌కో కుదుర్చుకొన్న ఒప్పందం ప్రకారం.. అదనపు రుణం నిధులను విడుదల చేయాలి. ఇందుకు సంబంధించి ఇప్పటికే రూ.1,600 కోట్లను తెలంగాణ జెన్‌కో తన వాటాగా విడుదల చేసింది. మరో రూ.345 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నది. ఈ మొత్తం విడుదల చేయకపోవడంతో.. పీఎఫ్‌సీ రూ.7,500 కోట్ల అదనపు రుణం నిధులను నిలిపివేసి.. మీ వాటాగా విడుదల చేయాల్సిన మొత్తం చెల్లించిన తర్వాతే అదనపు రుణంవిడుదల చేస్తామంటూ మెలిక పెట్టింది.

ఇదిలా ఉండగా.. పీఎఫ్‌సీ నుంచి అదనపు రుణం నిధులు నిలిచిపోవడంతో గత నెల నుంచి నిధుల లేమితో జెన్‌కో బిల్లులను చెల్లించడం లేదని సమాచారం. కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సీఎం సమక్షంలో జరిగిన సమీక్ష సమావేశంలోనూ ఇదే విషయం చర్చకు వచ్చినట్టు తెలిసింది. నిర్మాణ పనులు చేస్తున్న బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులుకూడా డిప్యూటీ సీఎం సమక్షంలోనే పెండింగు బిల్లులను చెల్లించాలని జెన్‌కో అధికారులకు సూచించారు. పీఎఫ్‌సీ నుంచి రావాల్సిన అదనపు రుణ నిధుల గురించి ఈ సందర్భంగా జెన్‌కో అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తున్నది. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రానట్టు సమాచారం. దీంతో థర్మల్ కేంద్రం నిర్మాణ పనుల్లో ఎలాంటి కదలిక రాలేదు. స్తబ్ధత అలాగే కొనసాగుతున్నది. ఇలాంటి పరిస్థితి ఎదురైతే.. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని బీహెచ్‌ఈఎల్‌కు భరోసా ఇచ్చి.. అవసరమనుకొంటే తక్షణమే ప్రభుత్వం వాటా నిధులకు హామీగా నిలబడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని నిపుణులు అంటున్నారు. అలాంటి భరోసా ప్రభుత్వం నుంచి వచ్చి ఉంటే.. పనుల్లో వేగం పెరిగేదని, తద్వారా తొందరగా నిర్మాణ పనులు పూర్తిచేయాలనే ప్రభుత్వం ఆలోచన అమలయ్యేదని వారంటున్నారు. ఆర్థిక సమస్యలున్నాయని అంటున్న ప్రభుత్వమే.. వాటిలో తక్షణం పరిష్కరించాల్సిన అంశాలపై దృష్టి సారించకపోతే.. నిర్మాణం కుంటుపడుతుందని, తద్వారా థర్మల్ విద్యుత్తు కేంద్రం వ్యయం పెరిగి.. అంతిమంగా వినియోగదారుడిపై అధిక చార్జీల భారం పడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జెన్‌కోకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తే.. వెంటనే పీఎఫ్‌సీ అదనపు రుణం విడుదల చేస్తుందని, దీంతో పనులు వేగంగా చేయవచ్చని, తద్వారా ప్రభుత్వం లక్ష్యం నెరవేరడంతోపాటు వినియోగదారులపై మోపే భారాన్ని తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

పీహెచ్‌డీకి ఫుల్ డిమాండ్!

- పరిశోధన వైపు విద్యార్థుల ఆసక్తి
- ఐదేండ్లల్లో భారీగా పెరిగిన అడ్మిషన్లు
- దేశీయంగానూ పెరిగిన ప్రవేశాలు



హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు ఇటీవల పీహెచ్‌డీపై మనసు పారేసుకుంటున్నారు. ఏటేటా ప్రవేశాలు పెరుగుతుండడం ఈ కోర్సులకు ఉన్న డిమాండ్‌ను చెప్పకనే చెప్తున్నది. విద్యార్థులు పరిశోధన వైపు మొగ్గు చూపడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది. దేశీయంగానూ పీహెచ్‌డీలో ప్రవేశాలు ఇటీవల భారీగానే పెరిగాయి. 2017-18 విద్యా సంవత్సరం నుంచి 2021-22 విద్యాసంవత్సరం వరకు ఐదేండ్ల కాలంలో రాష్ట్రంలో పీహెచ్‌డీ అడ్మిషన్లు సగానికిపైగా పెరిగినట్టు ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇటీవల వెల్లడించింది. సంఖ్యాపరంగా చెప్పుకోవాలంటే 2,083 పీహెచ్‌డీ అడ్మిషన్లు అదనంగా నమోదయ్యాయి. వీటిలో రెగ్యులర్ పీహెచ్‌డీలే 90 శాతానికిపైగా ఉండడం గమనార్హం. రాష్ట్రంలో మొత్తం 6,967 అడ్మిషన్లు రాగా అందులో 6,921 అడ్మిషన్లు రెగ్యులర్ కాగా, 46 మంది మాత్రమే దూరవిద్య ద్వారా పీహెచ్‌డీ కోర్సుల్లో చేరారు. నాలుగేండ్ల డిగ్రీ పూర్తిచేసిన వారికి పీజీతో సంబంధం లేకుండా నేరుగా పీహెచ్‌డీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. పీహెచ్‌డీలో ప్రవేశాలు పెరిగేందుకు దీనిని కూడా ఓ కారణంగా చెప్పుకోవచ్చు. అదే సమయంలో ఎంఫిల్ కోర్సుల్లో చేరే వారి సంఖ్య దారుణంగా పడిపోతున్నది. 2017-18లో 794మంది ఎంఫిల్‌లో చేరితే 2021-22 నాటికి ఆ సంఖ్య 100కు పడిపోవడం గమనార్హం.

తెలంగాణలో పీహెచ్‌డీ ప్రవేశాలు

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2021-22	4,442	2,525	6,967
2020-21	4,228	2,487	6,715
2019-20	3,507	2,001	5,508
2018-19	2,191	1,239	3,430
2017-18	3,552	1,632	4 ,884

గత ఐదేండ్లలో అడ్మిషన్లు ఇలా

- పీజీ కోర్సుల్లో చేరుతున్న వారి సంఖ్య రెట్టింపవుతున్నది. అప్పట్లో పీజీ అడ్మిషన్ల సంఖ్య 1.94 లక్షలుంటే, ఈ ఐదేండ్లల్లో 2.07లక్షలకు పెరిగింది.
- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లోనూ అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. 2017-18లో యూజీ కోర్సుల్లో చేరినవారి సంఖ్య 10.79 లక్షలుంటే ఉంటే 2021-22 నాటికి వీరి సంఖ్య 12.73 లక్షలకు చేరింది.
- డిప్లొమా కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. 2017-18లో 1.28 లక్షల మంది డిప్లొమా కోర్సుల్లో చేరితే, 2021-22 నాటికి ఆ సంఖ్య 91 వేలకు పడిపోయింది.
- ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో అడ్మిషన్లు దాదాపు రెండింతలయ్యాయి. ఐదేండ్ల కాలంలో ఈ కోర్సుల్లో అడ్మిషన్లు 4,950 నుంచి 7,619కు పెరిగాయి. సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్లు 1,835 నుంచి 3,122కి చేరాయి.



దొంగ రిజిస్ట్రేషన్‌కు వెళ్లి దొరికిండ్రు!

- ల్యాండ్ మాఫియా గుట్టురట్టు చేసిన సబ్‌రిజిస్ట్రార్
- బతికి ఉన్న వ్యక్తి డెత్ సర్టిఫికెట్ సృష్టించిన ముఠా
- వారసురాలిగా నకిలీ భార్య.. ప్లాట్ కాజేసే కుట్ర
- రిజిస్ట్రేషన్ ఆపి.. యజమానికి సబ్‌రిజిస్ట్రార్ లేఖ
- అమెరికా నుంచి వచ్చిన ప్లాట్ అసలు యజమాని

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఒక వ్యక్తి చనిపోయినట్టు డెత్ సర్టిఫికెట్ సృష్టించి, అతని వారసురాలిగా నకిలీ భార్యను సృష్టించి రూ.కోట్ల విలువైన ప్లాట్ కాజేసేందుకు ల్యాండ్ మాఫియా పన్నిన కుట్ర రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ అప్రమత్తతతో బయటపడింది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ ముఠా కదలికలను అనుమానించి, ఆ రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో పెట్టి, డాక్యుమెంట్లలో ఉన్న చిరునామాకు లేఖ రాయడంతో అసలు విషయం తెలిసింది. బాధితుల వివరాల ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం మునలూరుకు చెందిన చెరుకూరి శ్రీనివాసరావు 1998నుంచి అమెరికాలో కుటుంబంతో నివాసముంటున్నారు. 2000లో రాజేంద్రనగర్ బుద్వేల్‌లో జనచైతన్య హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫేస్-2లో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ ప్రాంతం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోకి రావడంతో గజం రూ.60 వేలకుపైగానే పలుకుతున్నది. ఈ భూమిపై కన్నేసిన కబ్జారాయుళ్లు ప్లాట్ వివరాలు సేకరించి, 2009లో శ్రీనివాస్‌రావు మృతిచెందినట్టు మీసేవ ద్వారా దరఖాస్తు చేశారు. 2010లోనే రికార్డుల్లో ఎక్కినట్టు నార్సింగి మున్సిపాలిటీ ద్వారా మరణ ధ్రువీకరణ పత్రాన్ని గత మార్చిలో సేకరించారు. మృతుడికి భార్య కృష్ణవేణి అని ఒక నకిలీ భార్యను సృష్టించి, ఆధార్ తయారుచేశారు. ఆమె ప్లాట్‌ను విక్రయించే అర్హత కలిగినట్టు డాక్యుమెంట్లు తయారుచేసి ఈ నెల 8న రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ ఆమెను ఎందుకు టెన్షన్‌గా ఉన్నారు? మీ భర్త ఎప్పుడు చనిపోయారు? అని ప్రశ్నించారు. ఒకసారి 5 నెలల క్రితం అని, మరోసారి ఐదేండ్లు, ఇంకోసారి ఎనిమిదేండ్లు అంటూ పొంతనలేని సమాధానాలు చెప్పడంతో రిజిస్ట్రేషన్‌ను హోల్డ్‌లో పెట్టి 30న రిజిస్ట్రేషన్ చేస్తానంటూ వాళ్లను పంపించేశారు. లింక్ డాక్యుమెంట్లలో ఉన్న చిరునామా మునలూరుకు సబ్ రిజిస్ట్రార్ లేఖ రాసి రిజిస్ట్రేషన్ సంగతి తెలిపారు. తన ముందు 29న హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. విషయం తెలిసిన శ్రీనివాస్‌రావు.. తాను బతికే ఉన్నానని, వెంటనే తన బంధువులు డాక్యుమెంట్లు అందిస్తారని సమాచారం ఇచ్చారు. సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో హాజరయ్యేందుకు అమెరికా నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడి ముఠాపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. అధికారి అప్రమత్తతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రాన్స్‌కో, జెన్‌కోకు త్వరలో కొత్త డైరెక్టర్లు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కోలకు కొత్త డైరెక్టర్లను నియమించాలని శనివారం ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ ఉత్తర్వులు జారీచేశారు. రెండేండ్ల కాలానికి డైరెక్టర్లను నియమిస్తారని, అత్యవసరమైతే మరో రెండేండ్లు పొడిగిస్తారని పేర్కొన్నారు. కాగా ట్రాన్స్‌కోలో.. జాయింట్ ఎండీ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ నర్సింగ్‌రావు, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్‌రెడ్డి, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ డైరెక్టర్ సూర్యప్రకాశ్, గ్రిడ్ ఆపరేషన్స్ డైరెక్టర్ నర్సింగారావు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువకాలం పదవిలో కొనసాగారు. ఇక జెన్‌కోలో హైడల్ డైరెక్టర్ వెంకట్రాజం, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ సచిదానందం, హెచ్‌ఆర్ డైరెక్టర్ అశోక్‌కుమార్, థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సివిల్ డైరెక్టర్ అజయ్, కమర్షియల్ ఫ్యూయల్ డైరెక్టర్ టీఆర్కే రావు సైతం నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువకాలం పదవిలో కొనసాగినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో కొత్త డైరెక్టర్ల కోసం నోటిఫికేషన్లు జారీకానున్నాయి.

నిందితుడిని పోలీసులే తప్పించారు!

- *బోధన్ మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసులో కొత్త మలుపు*
- *బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్ అరెస్టు*
- *పంజాగుట్ట సీఐ అరెస్టుకు సైతం చర్యలు?*

ఖైరతాబాద్, జనవరి 28: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహిల్ అమీర్ కేసు అనేక మలుపులు తిరుగుతున్నది. నిందితుడిని తప్పించేందుకు కొందరు పోలీసు అధికారులే సహకరించినట్టు విచారణలో తేలడం విస్మయం కలిగిస్తున్నది. గతనెల 24న తేదీ తెల్లవారుజామున షకీల్ కొడుకు నడిపిన కారు బేగంపేటలోని ప్రజాభవన్ వద్ద బారికేడ్‌ను ఢీకొట్టిన ఘటన కేసులో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. రాహిల్ అమీర్‌ను తప్పించేందుకు కొందరు పోలీసు అధికారులు, తండ్రి, మామ, అతడి బావమరిది, ఇంట్లో పనిచేసే వారు, అనుచరులు ఇలా పది మంది వరకు సహకరించినట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇద్దరు పోలీసు అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్టు ఉన్నతాధికారుల దర్యాప్తులో తేలింది. ఇప్పటికే పంజాగుట్ట సీఐ దుర్గారావును సస్పెండ్ చేయగా, బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్ కీలక భూమిక పోషించినట్టు వెల్లడైంది. ప్రేమ్‌కుమార్‌తోపాటు అతడితో బేరం కుదిర్చిన మరో వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేసి పంజాగుట్ట స్టేషన్‌కు తరలించారు. మరింత లోతైన దర్యాప్తు కోసం వారిని వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయానికి తరలించినట్టు తెలిసింది. రాహిల్ గతనెల దుబాయికి పారిపోయాడు. పోలీసులు అతడి కోసం లుకౌట్ నోటీసు సైతం జారీ చేశారు. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలతో పంజాగుట్ట సీఐ దుర్గారావును సస్పెండ్ చేయగా, మొత్తం పది మందికి ఈ కేసుతో సంబంధం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రాహిల్‌ను తప్పించేందుకు ఇద్దరు సీఐల మధ్య ఫోన్ సంభాషణలు, బేరసారాలు కూడా జరిగినట్టు సమాచారం. బోధన్ సీఐ ప్రేమ్‌కుమార్‌ను అరెస్టు చేయగా, సీఐ దుర్గారావు అరెస్టుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. ప్రత్యేక బృందాలు ఆ పనిలో ఉన్నట్టు సమాచారం. రాహిల్ అమీర్ కేసులో ఇద్దరు పోలీసు అధికారుల ప్రమేయం ఉన్నట్టు తేలడంతో ఉన్నతాధికారులు డిపార్ట్‌మెంట్‌లోని మరికొందరి ప్రమేయంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరి కాల్ డాటాలను సైతం సేకరిస్తున్నట్టు తెలిసింది.

శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

ముగిసిన కోటి ప్రత్యంగిర మహాయాగం

పూర్ణాహుతికి హాజరైన దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కవాడిగూడ, జనవరి 28: కుర్తాళం శ్రీసిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కోటి ప్రత్యంగిర మహాయాగం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. ఈ కార్యక్రమంలో స్వామి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి, రమ్యానంద భారతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. యాగానికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మాట్లాడుతూ.. కోటి ప్రత్యంగిర మహాయాగం వల్ల సమాజంలోని అరిష్టాలు తొలగిపోయి ప్రజలకు శుభం కలుగుతుందని చెప్పారు. దేశంలో తొలిసారిగా 25 వేల కిలోల ఎండు మిరపకాయలతో ఈ యాగం చేయడం అమ్మవారి కృప అని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కుర్తాళం శ్రీసిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నగర నడిబొడ్డున ఈ యాగం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

ఏఐబీపీ పనులపై నేడు ఢిల్లీలో సమావేశం

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): సత్వర సాగునీటి ప్రయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) పనుల పురోగతిపై తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రత్యేక సమావేశం సోమవారం ఢిల్లీలో నిర్వహించనున్నది. ఏఐబీపీ కింద మేజర్, మీడియం కలిపి మొత్తం తెలంగాణలో 11 ప్రాజెక్టులుండగా, అందులో ప్రస్తుతం కేవలం దేవాదుల, పెద్దవాగు, రాజీవ్‌భీమా, వరదకాలువ, ఎస్సారెస్పీ స్టేజ్2 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ జాప్యం వల్ల ముందుకు సాగడం లేదు. అందుకు 140 కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయాలని గతంలోనే కేంద్రానికి తెలంగాణ ప్రతిపాదనలు పంపింది. తాజాగా ఆయా పనులకు సంబంధించి పురోగతి, కేంద్రం విడుదల చేసిన నిధుల వినియోగం అంశాలపై కేంద్రజల్‌శక్తిశాఖ సమీక్షించనున్నది.

'స్టాఫ్‌నర్స్' తుది ఫలితాలు విడుదల

- 7,094 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తి
- 31న నియామక పత్రాలు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): స్టాఫ్‌నర్స్ పోస్టుల తుది ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్సార్బీ) ఆదివారం విడుదల చేసింది. ఎంపికైన వారి జాబితాను ఎంహెచ్ఎస్సార్బీ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. మొత్తం 7,094 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్టు పేర్కొన్నది. వీరికి ఈ నెల 31న నియామక పత్రాలు అందజేయాలని వైద్యారోగ్య శాఖ నిర్ణయించింది. ఎల్బీస్టేడియంలో భారీ ఎత్తున సభ నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయాలని భావిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,204 స్టాఫ్‌నర్స్ పోస్టులకు ప్రభుత్వం 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 9 విభాగాల్లో పోస్టులు ఉన్నాయి. సుమారు 40 వేల మంది కిపైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. వీరికి నిరుడు జూలైలో ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించింది. తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియకు తాత్కాలిక ఆటంకం ఏర్పడింది. కొత్త ప్రభుత్వంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేకు మరో 1,890 పోస్టులను ప్రభుత్వం జత చేసింది. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగింది. గత నెలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన మెరిట్ లిస్ట్ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. మెరిట్ లిస్ట్ తప్పుల తడకగా ఉన్నదంటూ కొంత మంది అభ్యర్థులు కోఠిలోని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు వద్ద ఆందోళన చేపట్టారు. తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు. నార్మలైజేషన్‌పై, వెయిటేజీపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కొందరు అభ్యర్థులు కోర్టును సైతం ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ప్రత్యేకంగా అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు తీసుకొన్నారు. అందరికీ సమాధానాలు ఇచ్చారు. దీంతో నియామకాలకు అడ్డంకులు తొలగినట్టయింది.

'ఆఫీసర్'గా గుర్తించండి

స్టాఫ్‌నర్స్‌లను 'నర్సింగ్ ఆఫీసర్స్'గా హోదా మార్చుతూ ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో ఉత్తర్వులిచ్చింది. సీనియారిటీ ప్రకారం వివిధ హోదాలు కేటాయించింది. ఆ వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో రికార్డుల్లో పేరు మార్పు జరుగలేదు. ఈ నేపథ్యంలో పాత వారికి రికార్డుల్లో హోదా మార్పుతోపాటు.. కొత్తగా నియామక పత్రాలు అందించబోయే 7,094 మందికి 'నర్సింగ్ ఆఫీసర్'గా గుర్తింపు ఇవ్వాలని నర్సులు, అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

స్టాఫ్ నర్సులుగా ఎంపికైన అన్నాచెల్లె

ఒకే ఇంట్లో ఇద్దరికి ప్రభుత్వ ఉద్యోగాలు

శంకరపట్నం, జనవరి 28: ఆ అన్నాచెల్లెళ్లు.. ఒకేసారి, ఒకేపరీక్ష ద్వారా స్టాఫ్ నర్సులుగా ఎంపికయ్యారు. తన ఇద్దరు పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఆ తల్లి ఆనందానికి అవధులు లేవు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్‌కు చెందిన విజ్జిగిరి రాజకనుకయ్య-కోమల దంపతులకు కొడుకు విజ్జిగిరి కుమారస్వామి, కూతురు విజ్జిగిరి శిరీష ఉన్నారు. వారి తండ్రి కొన్నేండ్ల కిందట అనారోగ్యంతో మరణించాడు. తల్లి కోమల తమకున్న కొద్దిపాటి భూమిని సాగుచేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివించింది. 2022 మార్చిలో మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ స్టాఫ్ నర్స్‌ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా ఆ అన్నాచెల్లెళ్లు దరఖాస్తు చేశారు. ఆరు నెలల క్రితం నిర్వహించిన సీబీటీ ఆన్‌లైన్ ఎగ్జామ్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రాశారు. ఆదివారం సాయంత్రం ఫలితాలు వెలువడగా వీరిద్దరూ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని గ్రామస్థులు అభినందించారు.

అన్నాచెల్లె విజ్జిగిరి కుమారస్వామి, విజ్జిగిరి శిరీష

హెచ్‌ఎండీఏలో ఏసీబీ గుబులు

- గతంలో డైరెక్టర్‌గా శివ బాలకృష్ణ ఇచ్చిన అనుమతులపై దర్యాప్తు
- ఐదేండ్ల అనుమతుల ఫైళ్లపై ఆరా

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన శివ బాలకృష్ణ ప్రభావం హెచ్‌ఎండీఏపై పడింది. ఇప్పటి వరకు జరిపిన సోదాల్లో గుర్తించినవే కాకుండా ఈ స్థాయిలో అక్రమాస్తులను కూడబెట్టడానికి కారణమైన భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల లెక్కలను తేల్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. హెచ్‌ఎండీఏలో డైరెక్టర్‌గా బాలకృష్ణ 2018 నుంచి 2023 జూలై 12 వరకు విధులు నిర్వర్తించిన సమయంలో ఇచ్చిన అనుమతుల ఫైళ్లన్నీ పరిశీలిస్తామని, వాటిని సిద్ధ చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు. దాంతో హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని జోన్లవారీగా ఫైళ్లను ఒక్కచోటకు చేర్చే పనిని మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని ఆ విభాగం అధికారులకు ఏసీబీ గుబులు పట్టుకున్నది. హెచ్‌ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్‌లైన శంషాబాద్, శంకర్‌పల్లి, మేడ్చల్, ఘట్‌కేసర్‌లో భారీ లేఅవుట్లు, మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్ (ఎంఎస్‌బీ)లకు అనుమతి ఇచ్చే అధికారం బాలకృష్ణ పరిధిలోనే ఉండేది. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేస్తూనే, మాసాబ్‌ట్యాంక్‌లోని ఎంఏయూడీ ప్రధాన కార్యాలయంలో బాలకృష్ణ డైరెక్టర్‌గా ఉన్నారు. రెండు కీలకమైన స్థానాల్లో ఉంటూ హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతులన్నీ ఎక్కువగా మాసబ్‌ట్యాంక్‌లోని ఎంఏయూడీ కార్యాలయం నుంచే ఇచ్చేవారని ఇక్కడి ఉద్యోగులు చెప్తున్నారు. ఇంటి అనుమతులకు పారదర్శక విధానమైన టీఎస్-బీపాస్‌ను గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసింది. కానీ, ఆన్‌లైన్ వ్యవస్థను పక్కన పెట్టి డిస్కషన్ పేరిట ఫైళ్లు ఆయనకు వద్దకు తెప్పించుకునే వారని ఉద్యోగులు చెప్తున్నారు. ఇవన్నీ విషయాలు ఫైళ్లవారీగా ఏసీబీ విచారిస్తే తమకు మెడకు చుట్టుకుంటుందోనన్న భయాందోళన కొందరు అధికారుల్లో నెలకొన్నది.

యూపీకి మన ఫార్మా!

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్‌లో సమావేశమైంది. మన రాష్ట్రానికి చెందిన రెడ్డీస్ ల్యాబ్స్, సువెన్ లైఫ్‌సైన్సెస్, లారస్ ల్యాబ్స్, భారత్ బయోటెక్, అరేనే లైఫ్ సైన్సెస్, సాంగ్‌ఫైడ్ ఇండస్ట్రీస్ తదితర 70కిపైగా కంపెనీల ప్రతినిధులతోపాటు బల్క్‌డ్రగ్ తయారీదారుల సంఘం, ఇండియన్ డ్రగ్ మ్యానిఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొని యూపీ బృందంతో సంప్రదింపులు జరపడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రంలో రెడ్ ఇండస్ట్రీలకు ఆదరణ కరువు

సాధారణంగా పరిశ్రమలను వైట్, గ్రీన్, ఆరెంజ్, రెడ్ క్యాటగిరీలుగా విభజిస్తారు. వీటిలో హానికారక రసాయనాలు, బల్క్‌డ్రగ్ పరిశ్రమలతోపాటు మనుషులకు, జంతువులకు, పర్యావరణానికి హాని కలిగించే కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను రెడ్ క్యాటగిరీలో ఉంచుతారు. దాదాపు ఫార్మా కంపెనీలన్నీ రెడ్ క్యాటగిరీలోకే వస్తాయి. ఈ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలను ట్రీట్‌మెంట్ (శుద్ధి) చేయాల్సి ఉంటుంది. ఇది ఎంతో ఖర్చుతో కూడిన వ్యవహారం అయినందున కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)ను ఏర్పాటు చేస్తే కంపెనీలపై చాలావరకు భారం తగ్గుతుంది. కానీ, మన రాష్ట్రంలో ఇప్పటివరకు రెడ్ ఇండస్ట్రియల్ ఏరియాను అభివృద్ధి చేయలేదు. సీఈటీపీ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో బాలానగర్, జీడిమెట్ల తదితర ప్రాంతాల్లోని ఫార్మా పరిశ్రమలు సొంత ఖర్చుతో తక్కువ సామర్థ్యం కలిగిన సీఈటీపీలను ఏర్పాటు చేసుకోగా.. కొన్ని చిన్న పరిశ్రమలు తమ వ్యర్థ జలాలను అక్రమంగా నాలాల్లోకి, చెరువుల్లోకి వదులుతున్నాయి. దీనిపై ప్రజల నుంచి తరచూ వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో గత కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 16 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో ఇప్పటికే 13 వేల ఎకరాలు సేకరించింది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కూడా లభించడంతో పరిశ్రమల ఏర్పాటుకు పలు పెద్ద కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. దీంతో ఫార్మాసిటీలో మౌలిక సదుపాయాలను కల్పించి, సీఈటీపీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఫార్మాసిటీపై స్పష్టమైన వైఖరిని వెల్లడించకపోవడంతో పరిశ్రమ వర్గాల్లో సందిగ్ధత నెలకొన్నది.

'ఫార్మా'పై రేవంత్ సర్కారు శీతకన్ను

మన రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోగా తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయినట్టు పదేపదే దుష్ప్రచారం చేస్తున్నది. ఫార్మాసిటీని రద్దు చేసి ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తామంటూ అడ్డగోలు వాదనాలు తెరపైకి తేవడంతో పరిశ్రమ వర్గాలు సందిగ్ధంలో పడ్డాయి. ఒకవేళ తెలంగాణలో ఫార్మాసిటీని ఏర్పాటు చేసినా స్థానిక ప్రభుత్వం నుంచి పరిశ్రమలకు ఎటువంటి సహకారం అందుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొనడంతో తెలంగాణ కంటే యూపీ అన్ని విధాలుగా ఉత్తమ ఎంపిక అవుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కష్టపడి తెచ్చిన పెట్టుబడులు, అభివృద్ధి చేసిన ఫార్మాసిటీ లాంటి ఇండస్ట్రియల్ పార్కుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. మరోవైపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. బహుళజాతి కంపెనీలతో ఎటువంటి ప్రయోజనం ఉండదని, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ)లపైనే తమ ప్రభుత్వం దృష్టి సారించిందని స్పష్టం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సైతం ఎంఎస్ఎంఈలకు త్వరలో కొత్త పాలసీని తెస్తామని చెప్తున్నారే తప్ప ఫార్మాసిటీ, ఎంఎన్‌సీల అంశాన్ని ప్రస్తావించడం లేదు. ఇవన్నీ తెలంగాణలో ఫార్మా రంగానికి పెద్ద సమస్యగా మారాయి. ఓ వైపు మన రాష్ట్రంలో ప్రతికూల పరిస్థితులు ఉండడం, మరోవైపు ఇతర రాష్ట్రం నుంచి అన్ని అనుకూలతలతో ఆహ్వానాలు అందడం పరిశ్రమ వర్గాలను ఆలోచింపజేస్తున్నది. అందుకే మన రాష్ట్రానికి చెందిన 70 మందికిపైగా పారిశ్రామికవేత్తలు యూపీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది.

భారీ తాయిలాలతో ముందుకొచ్చిన యూపీ

మన దేశంలో ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాలకు హైదరాబాద్ రాజధానిగా ఎదిగింది. ఇక్కడ అనేక రకాల ఔషధాలు, టీకాలను తయారుచేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణపై దృష్టి కేంద్రీకరించింది. ఇక్కడి ప్రభుత్వం పరిశ్రమలకు అందించని సౌకర్యాలు, ప్రోత్సాహకాలను తాము అందిస్తామని, అంతేకాకుండా తెలంగాణ కంటే యూపీలో భూముల ధరలు ఎంతో చౌకగా ఉన్నాయని, యూపీలో ఎంత భూమి తీసుకున్నా 15 శాతం రాయితీతో అందిస్తామని ఆ రాష్ట్ర ప్రతినిధివర్గం పారిశ్రామిక వర్గాలకు భరోసా ఇచ్చింది. మరోవైపు, యూపీకి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పథకాలు అందిస్తుండడం ఆ రాష్ట్రానికి మరో సానుకూల అంశంగా మారింది.

కొరియర్ ముసుగులో కోట్లు కొట్టేస్తున్న కేటుగాళ్లు!

- రాష్ట్రంలో పెరుగుతున్న 'ఫెడెక్స్' కేసులు
- రెండేండ్లలో 18.24 కోట్లు లూటీ
- హెచ్చరికలు జారీచేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): 'ఫెడెక్స్' కొరియర్ పేరుతో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. ఇటీవలి కాలంలో ఈ ముఠా అమాయకుల నుంచి దాదాపు రూ.18.24 కోట్లు కొల్లగొట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఏడీజీ శిఖాగోయెల్ ప్రజలను అప్రమత్తం చేశారు. కొరియర్ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. ఇలాంటి నేరాలకు సంబంధించి 2022లో 64 కేసులు నమోదు కాగా, నిరుడు 645 కేసులు నమోదైనట్టు శిఖా గోయెల్ తెలిపారు. 2022 నుంచి 2024 వరకు నమోదైన మొత్తం కేసుల్లో రూ.18,24,56,908 కోట్లు కొల్లగొట్టారని, అందులో రూ.4,77,01,679ను నేషనల్ సైబర్ రిపోర్టింగ్ పోర్టల్ సాయంతో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో కాపాడినట్టు వివరించారు.

మోసం జరిగేదిలా..

తాము ఫెడెక్స్ కొరియర్ నుంచి మాట్లాడుతున్నామని, మీకో పార్సిల్ వచ్చిందని ఫోన్ చేసి వివరాలు తీసుకుంటారు. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేసి ఆ పార్సిల్‌లో డ్రగ్స్ ఉండడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పి భయం పుట్టిస్తారు. ఢిల్లీ, ముంబై పోలీసులు కాల్ చేస్తారని చెప్పి పెట్టేస్తారు. అనంతరం పోలీసుల పేరుతో ఫోన్లు చేసి తాము స్వాధీనం చేసుకున్న పార్సిల్‌లో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టు, విదేశీ కరెన్సీ ఉన్నాయని, కేసు నమోదు చేస్తున్నట్టు చెబుతూ మరింతగా బెదిరిస్తారు. స్టేట్‌మెంట్ రికార్డింగ్ అంటూ హడావుడి చేస్తారు. ఆధార్‌కార్డు, ఇతర వ్యక్తిగత, బ్యాంకు వివరాలు సేకరిస్తారు. జరిమానా కింద డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తారు. లేదంటే మనీలాండరింగ్ కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తారు. అప్పటికీ లొంగకపోతే సీబీఐ, కస్టమ్స్ పోలీసులు వస్తారని చెప్పి లక్షల్లో డబ్బులు వసూలు చేసి పత్తాలేకుండా పోతారు. ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయెల్ సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఇలాంటి నేరాల బారినపడిన వారు www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని, లేదంట 1930 నంబర్‌కు ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చని, 87126 72222 నంబరుకు వాట్సాప్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.